
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 15 ఏప్రిల్ 2023



తాతయ్యగుంట గంగమ్మకు కొబ్బరికాయల మొక్కు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఇందుకు కృషి చేసిన తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వైఎస్ఆర్‌సిపి నాయకులు గంగమ్మ గుడి ముందు 1001 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గంగమ్మ గుడి గర్భాలయ పనులను పరిశీలించారు.



పొయ్యి పోయే... కిరోసిన్ లేదాయే..

'బండ' బాదుడు..!

రూ.1200కు చేరువలో సిలిండర్ ధర
మెల్లమెల్లగా 'సబ్సిడీ' ఎత్తేసిన కేంద్రం
మోడీ హయాంలో ఏడాదికి రూ.100కోట్ల భారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'పొయ్యి నుంచి వచ్చే పొగ వల్ల మహిళల కళ్లల్లో కన్నీరు వస్తుంది.. ఏ మహిళ కంటా కన్నీరు రాకూడదు.. సబ్సిడీపై అందరికీ గ్యాస్ సిలిండర్లు ఇస్తాం.. మహిళలు ఎంచక్కా గ్యాస్‌స్టవ్‌పై వంట చేసుకోవచ్చు అని పాలకులు రెండు దశాబ్దాలుగా పదేపదే ఊదరగొట్టి అందరితో గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు కొనిచ్చారు.. సబ్సిడీపై సిలిండర్లు తక్కువ ధరకు ఇస్తామని పేదలనూ వదలకుండా 'గ్యాస్' కొట్టారు.. తీరా 2014 నుంచి మోడీ హయాంలో సిలిండర్‌పై రూ.800 పైనే పెంచేశారు. విడతలవారీగా తొమ్మిదేళ్లలో దొంగదెబ్బ కొట్టారు.. పెంచిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చేవి. ఉదయాన్నే నిద్రలేచిన మహిళలు ఉలిక్కిపడేవారు. గతంలో చౌక దుకాణాల్లో కిరోసిన్ ఇచ్చేవారు. అదీ లేకుండా చేశారు. ప్రస్తుతం పొయ్యి లేదు.. కిరోసిన్ లేకుండా చేశారు. వంటింట్లో గ్యాస్ వెలిగించాలంటే 'సెగలు' పొగలు కక్కుతోంది.. కుటుంబంలో 'లోటు' బడ్జెట్ నడుస్తోంది. గ్యాస్ ధరల పెంపుతో మోడీ హయాంలో ఏడాదికి రూ.100 కోట్ల భారం జిల్లా ప్రజానీకంపై పడింది.

ఏడాదికి ఐదారుసార్లు గ్యాస్ ధరలు పెంచేసి మోడీ ప్రభుత్వం మహిళల కంట కన్నీరు తెప్పిస్తోంది. దీనికితోడు 2020 నుంచి గ్యాస్ సబ్సిడీ ఎత్తేశారు. ప్రస్తుతం గ్యాస్ ధర 1155గా ఉంది. త్వరలోనే 1200కు చేరువయ్యే అవకాశం లేకపోలేదు. మరోసారి మోడీ గెలిస్తే మాత్రం రూ.1500 సిలిండర్‌కు సమర్పించాల్సిందేన్న విమర్శలూ లేకపోలేదు. గ్రామీణ మహిళలు ఇప్పటికే సిలిండర్ వదిలి పొయ్యి వైపు మళ్లుతున్నారు. సమీపంలోని అడవికి వెళ్లి కట్టెలు తెచ్చుకుంటున్నారు. ఎంతో అత్యవసరమైతే తప్ప గ్యాస్ స్టవ్‌ను గ్రామాల్లో వెలిగించడం లేదు. నగరాల్లో అయితే సిలిండర్ల వాడకం పెరిగింది. అవసరాల రీత్యా ధర ఎంతున్నా కొనాల్సిందేనని, బంధువులు వచ్చినపుడు ఒకట్రెండు సిలిండర్లు ఇంకా ఎక్కువ అవుతాయని నగరవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో మాదిరి పొయ్యి వెలిగించలేమని, గతంలో ఇచ్చే కిరోసిన్ కూడా లేకపోవడంతో అనివార్యంగా గ్యాస్ వాడాల్సిందేనన్నది వారి ఆవేదన.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 15,89,752 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినిత్యం 66వేల నుంచి 75వేల సిలిండర్ల అమ్మకాలు చేస్తున్నారు. ఇందులో హెచ్‌పి, ఇండెన్, భారత్‌గ్యాస్ కంపెనీలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి గ్యాస్ సిలిండర్ ధర రూ.1050 ఉండేది. ఈ ఏడాది మార్చి నాటికి రూ.1155కు చేరుకుంది. అంటే నాలుగు నెలల్లోనే వంద రూపాయలను కేంద్రం పెంచేసింది. నెలకు 8 కోట్ల 17 లక్షలపైనే భారం పడుతోంది.



కట్టెలపొయ్యే నయం : బబిత, తిరుపతి

నిత్యావసర వస్తువులతో పాటు అంతకంటే వేగంగా గ్యాస్ ధర ఆకాశానికి నిచ్చెనలా పెరుగుతోంది. దీంతో కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్లి కట్టెల పొయ్యితో వంట చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. గ్యాస్ సబ్సిడీని కేంద్రం ఎత్తేసింది. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు, గృహిణులకు ధరల భారం తప్పడం లేదు. గ్యాస్ ధరల పెంపు వల్ల అన్ని వస్తువులపై ప్రభావం చూపుతుంది. ఒక సిలిండర్ కనీసం నెలకు సరిపోవడం లేదు. గ్యాస్ ధరలు తగ్గించేవరకూ మహిళలుఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గ్యాస్ పెంపుతో మనీ ప్యాకెట్ ఖాళీ : సుబ్బమ్మ, రేణిగుంట

గ్యాస్ ధరలు పెరగడం వల్ల మహిళలు దాచుకునే మనీ ప్యాకెట్ ప్రతి నెలా ఖాళీ అవుతుంది. చమురు ధరలు ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్నా మన దేశంలో తగ్గకపోవడం దారుణం ,ఇప్పటికే అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయి, జీవనం సాగించాలంటే కష్టంగా మారింది. ధరలు తగ్గించాల్సిన ప్రభుత్వం మహిళలపై భారం వేయడం ఎంతవరకు సబబు. వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలిందే.





గృహిణులపై పెను భారమే
శాంతి, బిటిఆర్ కాలనీ

పెంచిన గ్యాస్ భారం వల్ల గృహిణులపై పెనుభారం పడుతోంది. ఇష్టమొచ్చినట్లు ధరలు పెంచుకుంటూ పోతే ఎలా.. ఓ వైపు రెండేళ్ల క్రితం వరకూ కరోనాతో పాట్లు పడ్డాం. జీతాలు పెరగలేదు. ఉద్యోగాలు పోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఏదిఏమైనా సామాన్యులకు గ్యాస్ వాడకం భారంగా మారింది. ప్రస్తుతం పొయ్యి వెలిగించలేము. కిరోసిన్ లేకుండా పోయింది. అలాగని గ్యాస్‌పైనే వంటంతా చేయాలంటే 'మంట' పుడుతోంది.



రూ.1500 పెరిగినా ఆశ్చర్యం లేదు
లీలావతమ్మ, యర్రావారిపాళెం

గ్యాస్ సబ్సిడీ గతంలో అంతోఇంతో అకౌంట్లలో పడేది. ప్రస్తుతం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. గ్యాస్ డెలివరీ బాయితో కలిపి రూ.1200 భారం పడుతోంది. గత ఎనిమిది సంవత్సరాలుగా గ్యాస్ ధరలు పెరగడమే తప్ప తగ్గినట్లు ఎన్నడూ వినలేదు. నిత్యావసర వస్తువులతో పాటు విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్‌తో పాటు గ్యాస్ ధర ఏమాత్రం తగ్గడం లేదు. సామాన్య మధ్యతరగతి ప్రజలకు గ్యాస్ ధర భారంగా మారింది. ప్రస్తుతం గ్యాస్ కొనే పరిస్థితి లేదు. ఈ ఏడాదిలోనే రూ.1500 ధర ఉంటుందని ప్రచారం జరుగుతుంది.

అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే...

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేంతవరకూ పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి ఉద్ఘాటించారు. శుక్రవారం అంబేద్కర్ 132వ జయంతి పురస్కరించుకుని వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 'మోడీని గద్దె దింపండి.. దేశాన్ని కాపాడండి' అని నినాదాలు చేశారు. భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు తలపెట్టిన ప్రచారభేరిని తిరుపతిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభించారు. అక్కడనుంచి నాలుగుకాళ్ల మండపం వరకూ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనలో దళితుల మీద దాడులు పెరిగిపోయాయని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవ్యవస్థను విచ్ఛిన్నం చేశారన్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసి నిరుద్యోగుల బతుకుల్లో చీకటి నింపారన్నారు. రాజ్యాంగబద్ధంగా నిర్మితమైన న్యాయవ్యవస్థను, సిబిఐని, ఎన్నికల కమిషన్‌ను తమ గుప్పెట్లో పెట్టుకుని గొంతెత్తిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కొంతమందిని జైల్లో పెట్టి,

వామపక్షాల 'ప్రచారభేరి' ప్రారంభం

మరికొంతమందిని ఎన్నికలకు దూరం చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. 2014 ఎన్నికలకు ముందు మోడీ రైతులను ఆత్మహత్యల నుంచి కాపాడతామని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల నుంచి బ్లాక్‌మనీ తీసుకొచ్చి ప్రతి అకౌంట్లో 15 లోల రూపాయలు వేస్తామని, అధిక ధరలను అరికడతామని చెప్పి మోడీకి అధికారంలోకి వచ్చిన తరువాత హామీ లేవీ గుర్తు లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు, రాజధాని నిర్మాణం, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టంలో పేర్కొన్న హామీలను మోడీ విస్మరించారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ ఉక్కు 32 మంది యువకుల బలిదానంతో నిర్మితమయ్యిందని, ప్రైవేటీకరణ చేస్తామన్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మాట్లాడకుండా మోడీకి భజన చేస్తున్నాయన్నారు. మోడీని గద్దె దింపేంతవరకూ అన్ని రాజకీయ పార్టీలూఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాధవ్, సాయి లక్ష్మి, హేమలత, బుజ్జి, జయంతి, వేణు, రవి, అక్బర్, సిపిఐ నాయకులు జయలక్ష్మి, కుమార్ రెడ్డి, నదియా, జల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ప్రచారభేరి ప్రారంభం

భీమా జ్యూవెలరీ షోరూం ప్రారంభం


ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి నగరంలో బంగారు షాపులకు జతగా భీమా జ్యూవెలర్స్ వచ్చి చేరింది. నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యూవెలర్స్‌ను ప్రముఖ హీరోయిన్ సంయుక్త శుక్రవారం ప్రారంభించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్‌వి హైస్కూల్ మైదానం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యూవెల్స్ షోరూమ్ వద్దకు చేరుకున్న ఆమె అభిమానులకు అభివాదం చేశారు. జ్యోతిప్రజ్వలనతో షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమా జ్యూవెలర్స్‌తో తనకు చిన్నప్పటి నుంచి పరిచయం ఉందన్నారు. తమ ఇంటిల్లిపాది ఇక్కడే జ్యూవెలర్స్ కొనుగోలు చేశామని తెలిపారు. అత్యాధునిక వెరైటీలతో, నాణ్యతలో రాజీ లేకుండా ఇక్కడ ప్రతి ఒకర్నీ మెప్పించగలిగే ఆభరణాలు లభ్యమవుతాయన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ఎండి అభిషేక్ బిందుమాదవ్ మాట్లాడుతూ 1925లో ఏర్పాటు చేసిన తమ సంస్థకు దేశ వ్యాప్తంగా 56 షోరూమ్‌లు ఉన్నాయని, తిరుపతిలో ఏర్పాటు చేసినది 57వ షోరూం అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి నాలుగు షోరూమ్‌లు ఉన్నాయన్నారు. సరికొత్త ఆగ్యూమెంట్ రీయాల్టీ టెక్నాలజీతో సరొకిత్త వెడ్డింగ్ కలెక్షన్లు లభ్యమవుతాయన్నారు. గోల్డ్, డైమాండ్స్, ప్లాటీనాం, సిల్వర్ ఆభరణాలు నాణ్యతలో రాజీ లేకుండా అందిస్తున్నామన్నారు. తిరుపతిలో షోరూమ్ ప్రారంభం సందర్భంగా సరికొత్త ఆఫర్లు ప్రకటించామన్నారు. గ్రాము బంగారుకు 300 రూపాయలు తగ్గింపు, డైమాండ్ జ్యూవెలర్స్‌పై 15వేలు, కేజీ సిల్వర్ ఆభరణాల కొనుగోలుపై 3వేలు తగ్గింపు ధరలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీన్ని తిరుపతి, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ చైర్మన్ బిందుమాదవ్ మాట్లాడుతూ గత 97 సంవత్సరాలుగా ఆభరణాల విక్రయాల్లో తమకు మేమే సాటిగా, వినియోగదారులకు నాణ్యమైన, సరికొత్త డిజైన్లతో కూడిన ఆభరణాలు అందిస్తూ, వారి మన్ననలను పొందామన్నారు. ఇప్పుడు తిరుపతిలో ఏర్పాటు చేసిన షోరూమ్‌ను అందరూ సందర్శించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరోజని బిందుమాదవ్, మేయరు డాక్టరు శిరీషా, కార్పొరేటర్ హనుమంతునాయక్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో 'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి : జేసీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జిల్లాలో 'నాడు-నేడు' పనులను వేసవి సెలవుల్లో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో పలు అంశాలపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ,జిల్లా అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో సమావేశమై రానున్న విద్యాసంవత్సరం ప్రారంభంలోగా ప్రస్తుతం జరుగుతున్న నాడు-నేడు పనులు పూర్తిచేయాలని, అందుకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో వుందని అన్నారు. విద్యా హక్కు చట్టం మేరకు ప్రవేటు పాఠశాలలో రానున్న విద్యాసంవత్సరానికి 25 శాతం సీట్లు 1 వతరగతి లో అడ్మిషన్ పేద పిల్లలకు కల్పించేలా విస్తృత ప్రచారం కల్పించాలని, సచివాలయ స్థాయిలో గుర్తింపు చేపట్టి ఆన్‌లైన్ లో నమోదు పూర్తి చేయాలని సూచించారు. పదవతరగతి పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా, మాల్ ప్రాక్టీస్ కు తావు లేకుండా నిర్వహించామని రేపటితో పరీక్షలు పూర్తి కానున్నాయని అన్నారు. అలాగే పది స్పాట్ వ్యాల్యువేషన్ కొత్త జిల్లాలో కూడా ఈ నెల 19 నుండి 26 వరకు నిర్వహణ ఉంటుందని పగడ్బందీగా ఏర్పాటు కావాలని సూచించారు. బడి బయట పిల్లల గుర్తింపు పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి అశోక్ కుమార్ , తిరుపతి, శ్రీకాళహస్తి డి.ఎల్.డి.ఓ.లు సుశీలా దేవి, ఆదిశేషా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ , డి ఎం హెచ్ ఓ శ్రీహరి, పిడి ఐసి డి ఎస్ జయలక్ష్మి, బి సి వెల్ఫేర్ అధికారి భాస్కర రెడ్డి పాల్గొన్నారు.



గ్రామంలో ఆర్డీవో విచారణ

ఆ భూములతో పురావస్తు శాఖకు సంబంధం లేదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మా పేరిట రికార్డులు ఉన్న భూములను పురావస్తు శాఖకు అప్పగించలేమని వరదయ్యపాలెం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన రైతులు సూళ్లూరుపేట ఆర్డిఓ చంద్రమౌళికి విన్నవించారు. వరదయ్యపాలెం మండలం పెద్ద పాండురు రెవిన్యూలో గల ముట్టంగి తిప్ప భూములను శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రమౌళి, స్థానిక మండల తహసిల్దార్ గౌరీ శంకర్రావుతో కలిసి సందర్శించారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు .అనంతరం సుబ్బానాయుడు కండ్రిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో స్థానిక రైతులతో ఆర్డిఓ మాట్లాడి వారి అనుభవంలో ఉన్న భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించారు .మండల రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతుల విన్నపాలను ఆయన విన్నారు . వారికి మద్దతుగా వచ్చిన సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజు రైతుల సమస్యల్ని సవివరంగా విన్నవించారు. 60ఏళ్లకు పైగా రైతుల అనుభవం లో వున్న భూములను పురావస్తు శాఖకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. పురావస్తు శాఖ వారు 70 ఏళ్ల క్రితమే ముట్టంగి తిప్ప భూములను వారికి కేటాయించినట్లు చెబుతున్నారు.. అయితే ఇన్ని సంవత్సరాలుగా.. సంబంధిత భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు.. చేపట్టకనే ఉన్నపళంగా ఆ భూములు తమవని పురావస్తు శాఖ అనడం సబబు కాదని ఆర్ డీ ఓ కి వివరించారు. రైతుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన ఆర్డిఓ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను జిల్లా కలెక్టర్ కు సవివరంగా నివేదిక అందజేస్తామన్నారు .కలెక్టర్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు .అప్పటివరకు సంబంధిత భూముల్లో పురావస్తు శాఖ వారు పనులు చేపట్టేందుకు వీలులేదని సూచించారు. ఆయన వెంట ఆర్ ఐ వేణుగోపాల్, మండల సర్వేయర్ రమణ, ఆదిలక్ష్మి వున్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో 'శ్రీ చైతన్య' ప్రతిభ


ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి బైరాగి పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్ నందు శుక్రవారం ప్రతి సంవత్సరం సబ్జెక్టులు వారిగా పాఠశాలలో ఎంటీఎస్ఓ , జి టి ఎస్ ఓ, ఏ టి ఎస్ ఓ, ఎస్ టి ఎస్ఓ, ఈ టి ఎస్ ఓ, ఈవీఎస్ఓ, ఒలంపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ అన్నపూర్ణ అభినందనలు తెలిపారు. ఎటిఎం సురేష్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎలాంటి పరీక్షలనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని, తార్కిక జ్ఞానాన్ని పొందడం అత్యంత అవసరమని అన్నారు. ఇందుకుగాను గ్రాండ్ ప్రైజ్ లాప్టాప్, మొదటి బహుమతి ట్యాబ్, రెండవ బహుమతి స్మార్ట్ వాచ్, నాల్గవ బహుమతి కి గాను స్కై బ్యాగ్స్ ఇద్దరికి, ఐదవ బహుమతి 10 హెడ్సెట్ ముగ్గురికి, కన్సోలేషన్ ప్రైసెస్ 33మందికి, 57 మందికి గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్స్ మొత్తం గాను 98 మంది గెలుపొందిన విద్యార్థులకు ఏజీఎం సురేష్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శివ రాజు, సి బ్యాచ్ ఇంచార్జ్ వి వి రెడ్డి, సివిల్స్ ఇంచార్జ్ ఆముక్త, ప్రైమరీ ఇన్చార్జ్ వనిత పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతి రోజునే...

దళితులపై పెత్తందారుల మూకుమ్మడి దాడి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అంబేద్కర్ జయంతి రోజునే దళితులపై పెత్తందారులు మూకుమ్మడి దాడిచేసిన ఘటన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం నెన్నూరులో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు... అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని నెన్నూరు పక్కనే ఉన్న నడవలూరు ఐవై కాలనీ దళితవాడలోని కమ్యూనిటీ హాలులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మురళి, మణికంఠలకు చెందిన ఆటో, స్కూటర్లు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. దీంతో నెన్నూరుకు చెందిన టిడిపి మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి అనుచరులు దళితులను దూషిస్తూ 'మాది...కు అధికారం ఇస్తే ఇలాగే ఉంటుంది, ముందు బండ్లు తీయి' అంటూ కులం పేరుతో దూషించారు. మురళి, మణికంఠలపై దాడికి పాల్పడ్డారు. వైసిపిలో చేరి రాజకీయాలు చేస్తున్నారా? అంటూ బూతులు తిట్టారు. దీంతో తమకు న్యాయం చేయాలని రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో బాధితులు మురళి, మణికంఠలు రక్తగాయాలతో ఫిర్యాదు చేశారు. ఉదయం జరిగిన ఘటనకు సాయంత్రం అయినా కేసు నమోదు చేయకపోవడంతో సిపిఎం, మాదిగ మహాజన నాయకుల ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ ముందు బాధితులకు మద్దతుగా నిరసన తెలిపారు. మధుసూదన్‌రెడ్డి అనుచరులైన లోకేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వంశీలపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. దీంతో ఎస్ఐ గిరిధర్ కేసు నమోదు చేసి, చికిత్స నిమిత్తం మురళి, మణికంఠ, మరో ఇద్దరిని రుయాకు తరలించారు. దళిత నాయకులు పరశురాం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్‌డి శ్రీను, మాదిగమహాజన నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.



బాధితుని పరామర్శిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నేతలు

రాజ్యాంగ నిర్మాతకు పోటెత్తిన అభిమానం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రపంచమేధావి, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీమ్‌రావ్ అంబేద్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. అంబేద్కర్ 132వ జయంతి పురస్కరించుకుని కుల, మత, ప్రాంత, లింగబేధాలకు అతీతంగా ఆయన కృషిని కొనియాడుతూ జేజేలు పలికారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డ్రమ్స్, డప్పుల వాయిద్యాలతో భారీ ర్యాలీలు నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాల కొనసాగింపుగా 'మోడీని గద్దె దింపుదాం' అనే నినాదంతో వామపక్షాల ప్రచారభేరి శుక్రవారమే ప్రారంభమై నెలాఖరు వరకూ సాగనుంది. అంటరానితనాన్ని రూపుమాపడానికి, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి, కులవివక్షను నిర్మూలించడానికి అంబేద్కర్ చేసిన కృషిని మేధావులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు.

తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చల్లప్పమేస్త్రి మెమోరియల్, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ సదస్సు జరిగింది. ఎస్వీయూ మెయిన్‌గేటు, జీవకోన, చెన్నారెడ్డికాలనీ, ఆటోనగర్‌లోని అంబేద్కర్ విగ్రహాలకు భారీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఏపిఎస్ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి తిరుపతి ఎంపి డాక్టరు మద్దిల గురుమూర్తి, ఎంఎల్ఏ భూమన కరుణాకరరెడ్డి, మేయరు డాక్టరు

వేడుకగా అంబేద్కర్ జయంతి

శిరీషా, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జేసి బాలాజీ, కమిషనర్ హరిత, తదితరులు గజమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, ప్రతి ఒక్కరికీ ఓటు అనే ఆయుధాన్ని అందించారన్నారు. ప్రపంచంలో అదర్శవంతమైన భారత రాజ్యాంగాన్ని రచించి, అనేక డిగ్రీలు సాధించి ప్రపంచ మేధావిగా కీర్తింపబడుతున్నాడని కొనియాడారు. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న అంబేద్కర్ భవన్ స్థానంలో మల్టీభవనం నిర్మాణానికి తన వంతుగా కోటి రూపాయలు సహాయం చేస్తానని, ముఖ్యమంత్రితో మాట్లాడి మరో 4 కోట్ల రూపాయలు సహాయం చేస్తానని తెలిపారు. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ఎంపి కృషి చేయాలని అంబేద్కర్ సంఘాల నాయకులు ఎంపిని కోరారు. జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగానే మనకు అంబేద్కర్ తెలుసని, కానీ ఆయన మేధావితనాన్ని ప్రపంచం గుర్తించిందన్నారు. లండన్ మ్యూజియంలో రెండు విగ్రహాలు పెడితే ఒకటి కార్ల్‌మార్క్స్, రెండోది అంబేద్కర్‌ది అని గుర్తు చేశారు. కార్ల్‌మార్క్ సిద్ధాంతం రచిస్తే సమానత్వం కోసం పోరాటం జరిగిందని, కానీ అంబేద్కర్ జీవిత కష్టాలను అనుభవించిన వ్యక్తిగా సమానత్వం, హేతు బద్ధతను రాజ్యాంగం ద్వారా కల్పించారన్నారు. టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, టిడిపి మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, నరసింహాయాదవ్, పరమశివన్, చెంగల్రాయులు, భూపాల్, మురళీ, కృష్ణ నివాళి అర్పించారు.

తాళ్లపాక దాము ఆధ్వర్యంలో



బస్టాండ్ ఎదుట 500 మందికి చికెన్ బిర్యానీ, కుష్కా పంపిణీ చేశారు. సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నాయకులు కల్యాణ్, అజయ్‌కుమార్‌లు మండుతున్న ఎండల దృష్ట్యా దాదాపు రెండువేల మందికి వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో డైరెక్టర్లు ఎస్‌విఎన్ సుబ్బరాజు, కె.శివప్రసాద్‌రెడ్డిలు అంబేద్కర్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్కం డైరెక్టర్లు సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మధుబాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. స్విమ్స్‌లో టిటిడి జెఈఒ సదాభార్గవి, డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎఎస్‌పిలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, ఎఒ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీలో డిపిటిఒ చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. డిప్యూటీ సిఎటిఎం భాస్కర్‌రెడ్డి, పిఆర్ఒ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అవిలాల పంచాయతీలోని అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని వెస్ట్ డిఎస్‌పి నరసప్ప ఆవిష్కరించారు. అవిలాల సర్పంచి రమణ పాల్గొన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులురెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత పాల్గొన్నారు.

వాడవాడలా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: నిరుపేదల పాలిట ఆశా కిరణం బాబా సాహెబ్ అంబేద్కర్ అని కందారపు మురళి అన్నారు. శుక్రవారం బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించు కొని స్థానిక బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతి పత్రం అందజేసి, జైభీమ్ నినాదాలు చేశారు. సిపిఎం సెంటర్ కార్యదర్శి జోగి శివకుమార్, గ్రామ సేవకుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, గూడూరు మండల కార్యదర్శి రామయ్య, గూడూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, రమణయ్య, పోలయ్య, సీనయ్య, రమేష్ పాల్గొన్నారు.

● పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ ఆధ్వర్యంలో సిఐటియు, సిపిఎం నాయకులు కలిసి అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటరామిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, సిపిఎం నాయకులు జోగి శివకుమార్, పామంజి మణి, కెవిపిఎస్ నాయకులు సురేష్, ముత్యాలయ్య, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు గోపీనాధ్, చంద్రయ్య, ఆటో యూనియన్ నాయకులు బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

● పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, రమణయ్య, అజీజ్, నరసయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి అరుణాచలం ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు ఆఫీసు నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎం రమేష్, కె.సెల్వ కుమార్, కె.మునస్వామి, శేఖర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: భారత రాజ్యాంగ నిర్మాత, బిఆర్ అంబేద్కర్ జయంతిని వాడవాడలా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలం యుగందర్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు, చిన్నగొట్టిగల్లు సచివాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


గూడూరు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో...

కెవిబి పురం: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో కెవిబి పురంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, మండల కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, డి సుబ్రహ్మణ్యం, శంకరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాకాల: భారత రాజ్యాంగ సృష్టికర్త బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలో అంబేద్కర్ భవన్ వద్ద భవనం అధ్యక్షుడు ఆనందయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే మండల సిపిఎం నాయకులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో, డిఎస్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, బిఎస్ఎన్ నాయకులు శివకుమార్, డిఎస్ఎస్ మండల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గూడూరు రూరల్: మండలంలోని చెమిర్తి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. 400 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని కందలి పంచాయతీ చెమిర్తి గ్రామంలో సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● రాజ్యాంగ రూప కర్త అంబేద్కర్ అని వైసీపీ సీనియర్ నాయకులు చెవూరు విజయ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పురపాలక పరిధి లోని చెన్నూరు మొదటి హరిజన వాడ లో అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానికులతో కలసి ఆయన విగ్రహానికి పులా మాలలు వేసి నివాళులర్పించారు.


చంద్రగిరి: రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ దగ్గర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెళ్లకూరు: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జెడ్పిటిసి సన్నెం ప్రిన్సిల్లా, ఎంపీడీవో సురేష్ బాబు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఆఫీస్ సిబ్బంది, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రామయ్య వారి సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓజిలి: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు గుంట మధురు రవీందర్ రాజు, ఎంపీడీవో రజనీకాంత్, భువనగిరిపాలెం సర్పంచి చల్లా హంసవేణి, ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యర్రావారిపాలెం: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలో వాడవాడలా ప్రతి పంచాయతీలోనూ టిడిపి, వైసీపీ, దళిత సంఘ నాయకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహానికి వేరువేరుగా పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు.

శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధకులను నేటితరం నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బియ్యపు పవిత్రా రెడ్డి స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ కు నివాళులర్పించారు. వీఈపీఎ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అంబేద్కర్ కు నివాళులర్పించారు. వీసీకే కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు నివాళులర్పించారు. కాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఏ.కమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కు నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. సీనియర్ పాత్రికేయులు ఎంవి రమణ, ఈశ్వరయ్య, రవి, రఫీ, శీను, ఎస్ హరిబాబు, వీసీ వెంకటయ్య పాల్గొన్నారు.


తిరుపతి అర్బన్

● శ్రీకాళహస్తి బ్రాంచ్లోని ఎ.ఐ.ఎల్ఐసీ ఏజెంట్లు బ్రాంచి సెక్రెటరీ ఎం.రామకృష్ణయ్య, పి.శీను, ఎం. కొండయ్య, డి.దొరస్వామి, రామస్వామిలు ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల గూర్చి అంబేద్కర్ జయంతి సందర్భంగా విన్నవించారు.

తొట్టంబేడు: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రూ.2.50 లక్షలు పైగా వెచ్చించి తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భారత జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయించిన ఉన్నం వాసుదేవనాయుడును శుక్రవారం కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో పాత్రికేయులు, అధికారులు ఘనంగా సన్మానం చేశారు. ఇంచార్జ్ ఎంపీడీవో తరుణాకృష్ణ, పాత్రికేయులు మెహర్, హరి, కోట చంద్రశేఖర్ పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి

● మండలంలోని లింగమనాయుడు పల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గంధం వెంకటయ్య, కొప్పల సుబ్బయ్య, గంధం విజయ్, గంధం వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

క్యాంపస్: ప్రపంచానికి ఆదర్శనీయులు బీమ్ రావ్ అంబేద్కర్ అని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య కె.రాజా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పరిపాలన భవనంలో అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కులసచివులు ఆచార్య ఎన్.రజని, డీన్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయుడుపేట: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నాయుడుపేటలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు రాజకీయ పార్టీలు, పలు సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● స్థానిక సుందర రామిరెడ్డి భవన్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దొరవారిసత్రం: మండల పరిధిలోని వాడవాడలో శుక్రవారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దొరవారిసత్రం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జకరయ్య ఆధ్వర్యంలో, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి జరిపారు.

గూడూరు: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన కార్యక్రమం, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముందుగా బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సెక్రటరీ గోపి సభ్యులు మల్లి, ఎమ్ శ్రీనివాసులు, సురేష్, మస్తాన్, శ్రీనివాసులు, సాయి, నిరంజన్, విజయ్ పాల్గొన్నారు.

కోట: వాడవాడలా భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, పంచాయతీల ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ గూడూరు పట్టణ ఇన్చార్జ్ రామకృష్ణ, చోడవరం సుధాకర్, మీజూరు మాధవ్, కర్నపూడి పోలయ్య, టీడీపీ నాయకులు, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, పిపిఎఫ్ చైర్మన్ మీజూరు మల్లికార్జున్ రావు, పాల మల్లికార్జున రావు, పాల్గొన్నారు.

కెవిబి పురం: కెవిబి పురం మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ గ్రామ సహాయకుల సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వినతి పత్రాన్ని శుక్రవారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

కోట: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో బీఎస్పీ నాయకుడు ఉయ్యాల రామకృష్ణ రావు ఇంటి ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

తిరుపతి(మంగళం): మంగళం పంచాయతీ ఎన్సిబిఎన్ కాలనీలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళం పరిధిలోని తిరుమలనగర్, మంగళం, సప్తగిరి కాలనీ, రణధీరపురం పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జీవకోనలో..... అంబేద్కర్ ఆశయ సాధన కోసం కషి చేయాలని సిసిసి ఎస్సీ సెల్ కో చైర్మన్ చిట్టిబాబు కోరారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జీవకోనలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. శివశంకర్, దొరైరాజ్, గోపి, సుబ్రహ్మణ్యం, నరసింహులు, రామచంద్ర పాల్గొన్నారు.

రేణిగుంట: భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం రేణిగుంట సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటాన్ని తీసుకొని సిపిఎం పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు ఇచ్చుకుంటూ ర్యాలీ చేపట్టారు. వామపక్ష పార్టీ సిపిఎం- సిపిఐ నాయకులు కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. పట్టణ ప్రజలకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో 300 మంది పేదలకు ఏర్పాటు చేసిన "అన్నదాన కార్యక్రమాన్ని" ప్రముఖ డాక్టర్ గౌరేంద్ర చేతుల మీదుగా నిర్వహించారు. సిపిఎం పార్టీ నాయకులు సెల్వరాజ్, వెంకటరమణ, నరసింహారెడ్డి, ఈశ్వరమ్మ, హరినాథ్, వీరాంజయ్య, శ్యామ్, కుప్పస్వామి,విజయ్ కుమార్, బాబు, సుజాత, రమణయ్య, అంగనవాడి ధరణి, సిపిఐ పార్టీ నాయకులు తులసి రాజన్, చలపతి, మోహన్ రెడ్డి, ఖాదర్ వల్లి, ఏఐటీయుసి నాయకులు కార్తిక్, రజాక్, గోవింద్, నాగూర్ భాషా,


రేణిగుంట

నాగరాజ ఆచ్చారి, భాను చందర్, రసూల్, సెల్వ, శివగామి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ జయంతి సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ మంజునాదరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.

తిరుపతి అర్బన్: టీటీడీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో శుక్రవారం బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పుత్తూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను కుటుంబసభ్యులు ఆదరించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ట్రాన్స్‌జెండర్లను కుటుంబసభ్యులు ఆదరించాలని, చిన్నతనం నుంచే వారి హక్కులను తల్లిదండ్రులు గౌరవించి వారికి తగ్గట్టుగా పిల్లల్ని మలచుకున్నపుడు మానసికంగా కుంటుబాటు ఉండదని వక్తలు అన్నారు. వాలంటరీ హెల్త్ సర్వీస్, వన్‌స్టాప్ సెంటర్ (ఎన్జీవో), శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆద్వర్యంలో జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని భవానినగర్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ ఎ.మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల హక్కులను గౌరవించాలన్నారు. మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చి అసోసియేట్ డాక్టర్ టి.చైతన్య మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ అభివృద్ధిలో భాగంగా మానసిక, సామాజిక, ఆర్థిక, విద్య, సాంస్కృతిక రంగాలలో ముందుండాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డాక్టర్ లతాకుమారి, సుమిత్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్నేహసంఘం పెహచాన్ మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చి అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా 'డాలర్స్ ' దివాకర్ రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ గా డాలర్స్ డాక్టర్ సి. దివాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం తిరుపతిలోని ఒక ప్రైవేటు హెూటల్లో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డాలర్స్ దివాకర్ రెడ్డిని రాష్ట్ర వైస్ ఛైర్మన్ గాను, చెస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఛైర్మన్ గాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి దివాకర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల పట్ల తనకు ఉన్న మక్కువతో రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో చెస్ అసోసియేషన్ పదవులకు కు నియమించడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. వచ్చే నెలలో తిరుపతిలో జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అనంతరం డాలర్స్ దివాకర్ రెడ్డిని రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన చెస్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ కే వి వి శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున్ కార్యదర్శి శ్రీనివాస్ సూరి కోశాధికారి అమర్నాథ్ లు పాల్గొన్నారు.

28న వేదవిశ్వ విద్యాలయం స్నాతకోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్: దేశంలో యూజిసి గుర్తింపు ఉన్న ఏకైక వేద విశ్వవిద్యాలయమైన శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం సేవలు ఉత్తర భారత దేశంలోనూ విస్తరించాలని నిర్ణయించినట్లు టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీ వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గహంలో శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన వేద విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, హిందూ ధర్మప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రుషికేష్‌లో వేద విశ్వవిద్యాలయం సేవలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, టీటీడీ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొనారు.

విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : తాము ఎంచుకున్న రంగంలో విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా, నిబద్ధతగా ఉండాలని, ఆ లక్ష్య సాధనకు నిరంతరం కషి, పట్టుదల, వివిధ అంశాల పట్ల అవగాహన, విషయ పరిజ్ఞానం సాధించుకోవాలని శ్రీకష్ణదేవరాయ విశ్వ విద్యాలయం పూర్వపు ఉపకులపతి ఆచార్య కుసుమకుమారి పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నూతన విద్యార్థి సంఘం ఏర్పాటు ను స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య వైఎస్ శారద ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని డీన్‌లు ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ అనూరాధ, ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

జీవో 52ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎస్టీ జాబితాలో బోయ, పెంతు, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారిని చేరుస్తూ విడుదల చేసిన జీవో నెం.52 ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భారత యువ జన సమాఖ్య అధ్యక్షులు వినోద్ రాథోడ్ శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రవితేజ, సంతోష్, వెంకీ, బాలాజీ, అంకిత్ పాల్గొన్నారు.

ఫలించిన 25 ఏళ్ల నిరీక్షణ: ఎస్జిటి టీచర్లు

ప్రజాశక్తి-సత్యవేడు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి సానుకూల నిర్ణయంతో 25 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని ఎస్జిటి కొత్త టీచర్లు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. 1998 డీఎస్సీలో క్వాలిఫైడ్ ఎస్జిటిలకు పోస్టింగులు ఇవ్వకుండా ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబించింది. దీనిపై పలువురు బాధిత ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి సానుకూల ఆదేశాలు వెలువడినా 1998 డీఎస్సీలో క్వాలిఫైడ్ అయిన వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో 553 మందికి ఎస్జిటి పోస్టింగులు ఇచ్చారు.

స్టీల్ ప్లాంట్‌పై పునరాలోచన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై చేసిన పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పునరాలోచనలోపడిందని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు బాబ్జి, హేమ కుమార్, సుమన్ బాబు, రాజేష్ ఆచారి, రమేష్ నాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

రేపు వాల్మీకి వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి వాల్మీకి వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న కపిలతీర్థం వద్ద గల వాల్మీకి రామాలయం ప్రాంగణంలో వాల్మీకి బోయ సామాజిక వర్గాలకు సంబంధించిన వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షులు ఎంకే నాగరాజు శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వివరాలకు 9000151662 ను సంప్రదించాలన్నారు. ఉపాధ్యక్షులు నారాయణప్ప, మాజీ కార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ధనపాల్ . జన్మదిన వేడుకలు చిత్తూరు పార్లమెంటరీ ఎన్‌టిసి జిల్లా అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనపాల్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని తెలిపారు. ఆనంద్, వెంకటేష్, మోహన్, చెంచయ్య, గుర్రప్ప, వేలు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని షాదీ మంజిల్‌లో శుక్రవారం మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో 150 నిరుపేద ముస్లిం కుటుంబాలకు చీరలు, 14 రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. సంస్థ అధ్యక్షులు మహబూబ్ బాషా, అన్వర్, మగ్దూమ్, అబ్దుల్ రహీం, షబ్బీర్, రవూఫ్, జీలాని, కాలేష, అజీజ్, రవూఫ్, షబ్బీర్, అప్సర్, కరిముల్లా, సందాని బాషా పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో పుత్తూరులో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమైనట్లు అగ్నిమాపక దళ అధికారి నేతాజీ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వారోత్సవాల కరపత్రాలను విడుదల చేసి ఆవరణంలో మొక్కలు నాటారు. ఎల్ఎఫ్‌లు ఉమాపతి, రామస్వామి, డ్రైవర్లు మనోజ్, విశ్వనాధ్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల ప్రచారభేరి ప్రారంభం


గూడూరు టౌన్:

ప్రజాశక్తి-గూడూరు టౌన్: దేశ్ బచావో బీజేపీ హఠావో అనే నినాదంతో గూడూరు పట్టణంలో సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమరయాత్రను శుక్రవారం ప్రారంభించారు. వామ పక్షాల జాతీయ సమితి పిలుపులో భాగంగా గూడూరు నియోజకవర్గంలో సీపీఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరిని స్థానిక టవర్ క్లాక్ సెంటర్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కందరపు మురళీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకష్ణ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను నిలదీసి అడగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మోడీ అమిత్ షాల నాయకత్వంలో బిజెపి ఆర్ఎస్ఎస్ కలిసి ప్రజల మధ్యన మత కలహాలను రాజేస్తోందన్నారు. మరోవైపు అదానీ అంబానీ అడుగులకు మడుగులు ఎత్తుతూ దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ఒక్కొక్కటిగా అమ్ముతూ పోతున్నాడన్నారు. కార్మికుల ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ చూసినా ప్రతిపక్షాలపై విషం చిమ్ముతూ దళితులు మైనారిటీలు జర్నలిస్టులు మానవతావాదులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 30 వరకు జరిగే పాదయాత్ర లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రచార బేరిని నీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన గూడూరులోని టవర్ క్లాక్ వద్ద జరిగే బహిరంగ సభను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రచార భేరీలో సీపీఎం సెంట్రల్ కార్యదర్శి జోగి శివ కుమార్, పామంజి, మణి, రమణయ్య, అడపాల ప్రసాద్, ఎస్.ముత్యాలయ్య, సురేష్, గోపి, సీపీఐ నగర కార్యదర్శి షేక్ కాలేష, ఎఐటియుసి కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఎఐవైఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, గౌస్ బాషా, యాకోబు, బాలాజీ పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: వరదయ్యపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మోడీ హటావో దేస్కో బచావో అనే నినాదంతో ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీ యజమానులకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. అందుకే మోడీ హటావో దేస్కో బచావో అని సిపిఐ సిపిఎం పార్టీలు దేశవ్యాప్తంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని ప్రజలందరూ ఆలోచించి అర్థం చేసుకొని ఈ కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ నాయకులు దొడ్డి సిద్దలయ్య, పొన్నేరు బాల గురునాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -సత్యవేడు: ఎండలు ఎక్కువైన నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశంతో స్థానిక పోలీస్ అధికారులు చలివేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సామాజిక సేవలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీఐ శివకుమార్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రంను స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఆర్టీసీ డిఎం వెంకటరమణ, వైసీపీ నాయకులు గురు ప్రసాద్, ఎంపీ రవి, ఢిల్లీబాబు యాదవ్, శ్రీరాములు రెడ్డి, పాల్గొన్నారు.

తిరుచానూరు: స్థానిక సర్పంచ్ కె రామచంద్రారెడ్డి అమ్మవారి కోనేరు సమీపంలో చలివేంద్రంను ప్రారంభించారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పెరుగుతున్న ఎండల వలన తిరుచానూరు ప్రజలకు, అమ్మవారి దర్శనానికి విచ్చేయు భక్తులకు ఎల్లవేళలా చల్లని నీరును అందించాలనే సదుద్దేశ్యంతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఎంపిటిసిలు శేఖర్, నరేష్ రెడ్డి, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

పుత్తూరు సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు విజ్ఞప్తి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించిన పుత్తూరు సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని జిల్లా సిఐటియు నాయకులు ఆర్ వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం పనిదినంగా సిడిపిఒ ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించారు. పుత్తూరులో అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడం జరిగింది. పని దినంగా జరిపించడం అంటే అంబేద్కర్ ను అవమానించడమేనని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బలహీన వర్గాల పట్ల సిడిపిఓ గారు ఎంత వివక్షత ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రసాభాసగా గ్రామసభ


రేణిగుంట

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ రసాభాసగా సాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీఆర్ రావనన్ పంచాయతీలోని సమస్యలను పంచాయతి సెక్రటరీ విజయభాస్కర్ సర్పంచ్ నగేషం దష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ దుకాణాల వేలంలో అవకతవకలు జరిగాయని వాటికి సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. అందుకు పంచాయతీ సెక్రటరీ విజయభాస్కర్ మాట్లాడుతూ పంచాయతీ దుకాణాలు వేలం పారదర్శకంగా జరిగాయని, ఎవరు ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అలాగే సిపిఎం నాయకులు నరసింహారెడ్డి, సెల్వరాజ్, ఓవి రమణలు పట్టణంలోని సమస్యలపై ఇళ్ల స్థలాల విషయమై అధికారుల దష్టికి తీసుకెళ్లారు. అలాగే పట్టణంలో పందులు ఎక్కువగా ఉన్నాయని వాటిపై స్పందిచాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమాధానం చెప్పారు.

తిరుచానూరు: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయలంలో ఈఓ లక్ష్మి నారాయణ, సర్పంచ్ రామచంద్రారెడ్డిలు కలిసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ సభను ప్రారంభించి వాలంటీర్లు, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికై వాలంటీర్లకు తగిన సూచనలు చేశారు.

ఎంపీడీవో మృతి

ప్రజాశక్తి-సత్యవేడు: స్థానిక ఎంపీడీవో బాలగణేష్ (59) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. పెనుమూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బాలగణేష్ చిత్తూరులో నివాస ముంటున్నారు. గురువారం రాత్రి ఆయనకు ఆకస్మికంగా గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయనకు గుండపోటు తీవ్రతరం కావడంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు సమాచారం. ఎంపీడీవో మృతి పట్ల స్థానిక సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం సంతాపం తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మంత్రి ఆర్‌కె రోజా ఆదేశాల మేరకు స్థానిక కమిషనర్, ఏఈ పళ్లూరు, పాత పళ్లూరు, కేకేఆర్ పురం వార్డును శుక్రవారం సందర్శించారు. ఆ వార్డు పరిధిలోని రోడ్లు, డ్రెయిన్లు, వాటర్, శానిటేషన్ తదితర సమస్యలపై కౌన్సిలర్‌తో చర్చించారు. మున్సిపాలిటీ ఏఈలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలో నూతనం గా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ రామయ్య శుక్రవారం తన సిబ్బందితో కలిసి పరి సరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్ ఆఫీస్‌కు చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలు, అడ్డుగా కొమ్మలను తొలగించి, జెసిబి సహాయంతో పరిసర ప్రాంతాలను చదును చేసి శుభ్రం చేశారు.